# వినదగు నెవ్వరు చెప్పిన...

- చిరుమన వెంకట రమణయ్య



అవి సంక్రాంతి రోజులు. మోహన్, సుజాతలకు అది కొత్త పండగ. సుజాత తండ్రి చంద్రశేఖరం వచ్చి వారిని ఊరికి తీసుకెళ్లాడు. మోహన్ అత్తగారు పేదవారు. అయినా ఉన్నంతలో అన్ని మర్యాదలు సవ్యంగానే జరిపారు. తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యే రోజు అల్లుడికి, కూతురికి కొత్త బట్టలు పెట్టారు.

చంద్రశేఖరం ఇంటికి ఎదురు వరుసలో ఐదో ఇల్లు కాంతమ్మది. ఆమె చంద్రశేఖరం పెదనాన్న కుమార్తె. మోహన్ వాళ్లు ఆ ఊరికి ఎప్పుడు వచ్చినా కాంతమ్మ యింటికి కూడా వెళుతుండే వారు. బస్సు స్టాప్‌కు కూడా ఆ వైపు నుంచే వెళ్లాలి. మోహన్ సుజాతలు ఊరికి బయలు దేరుతూ చెప్పి పోదామని కాంతమ్మ యింటికి వెళ్లారు. మాటల మధ్యలో కాంతమ్మ "అమ్మాయ్ సుజాతా! మీ నాన్న గారు కొత్త బట్టలు పెట్టిన ట్లున్నారు, నేను చూడొచ్చా" అంది. సుజాత వాటిని ఆమెకు చూపింది. కాంతమ్మ చొక్కా గుడ్డ పొరను వేళ్ల మధ్యకు తీసుకొని టెక్స్చర్ పరిశీలించి ముఖం అదోలా పెట్టి, నిట్టూరుస్తూ "ఏమయ్యా మోహన్! మీ మామగారు బొత్తిగా కక్కుర్తి మనిషిలా వున్నాడు. లేకపోతే పండక్కో, పబ్బానికో అల్లుడికి పెట్టే బట్టల్లో కూడా పిసినా రితనమేనా! ఈ గుడ్డ చూడు ఎంత ముతగ్గా వుందో! అసలీ చొక్కా రంగేమిటి? దీన్ని వేసు కుని ఆఫీసుకు వెళితే అందరూ విన్న వేముల స్వామిలా వున్నావని ఎగతాళి చేయరూ! అయినా నాకెందుకొచ్చిన గొడవలే. ఏదో వుండబట్టలేక వున్నమాట అన్నాను" అని దీర్ఘాలు పోయింది. సుజాత బాధ పడుతుందేమోనని మోహన్ మాట మార్చి "బస్సుకు టైమవుతోంది. ఇక ఉంటాం పిన్ని గారు" అని కాంతమ్మకు వీడ్కోలు చెప్పాడు.

కాంతమ్మ మాటలు మోహన్ మనసులో బాగా నాటుకున్నాయి. అత్తగారు పెట్టిన కొత్త బట్టలు కుట్టించుకోవాలనే మక్కువ, యాస, అతనికి లేకుండా పోయాయి. సుజాత పోరు పడలేక వాటిని టైలరు దగ్గర యిచ్చాడు. కుట్టించు కున్నాడే గానీ ఒక్క రోజైనా వాటిని వేసుకున్న పాపాన పోలేదు. ఈలోగా చంద్రశేఖరం రెండు మూడు దఫాలు వచ్చి వెళ్లాడు. ఆయన వచ్చిన ప్పుడల్లా "అమ్మా సుజాతా! నేను తెచ్చిన బట్టలు అల్లుడిగారికి నచ్చాయో లేదో? కాటన్ పంచె, ఖద్దరు చొక్కా తప్ప మరొకటి ఎరుగని వాణ్ణి. ఈ కాలపు దుస్తుల గురించి నాకంతగా తెలియదు. మోహన్ నేను తెచ్చిన బట్టలు వేసుకుని వుండగా చూద్దామనుకున్నాను. ఎప్పుడూ వేసుకున్నట్లుగా కనిపించలేదు. అందుకే అడిగా నమ్మా!" అంటూ సందేహం వెలిబుచ్చేవాడు.

"అదేం లేదు నాన్నా! ఆయన అలాంటి వారు కారు. చాలా మంచి వారు. మీరు పెట్టిన బట్టలు వారికి బాగా నచ్చాయి. వాటినే ఎక్కువగా వేసు కుంటున్నారు." అంటూ తండ్రిని మభ్య పెట్టేది సుజాత. ఒక సారి మోహన్ తండ్రీ కూతుళ్ల సంభాషణ విన్నాడు. వారిని బాధపెడుతున్నందుకు లోలోన విచార పడ్డాడు. కానీ ఆ బట్టలు వేసుకునే ప్రయత్నం మాత్రం చేయలేదు.

ఒక సారి బాగా ముసురు పట్టింది. వారం రోజుల నుంచి ఎడ తెరిపిలేకుండా వర్షం కురు స్తూనే వుంది. మోహన్ పనిమీద బయట తిరిగేటప్పుడు వానకి తడవడం వల్ల, నడిచేటప్పుడు బురద పడటం చేత బట్టలు వెంట వెంటనే మార్చవలసి వచ్చింది. ఆ విధంగా అతనికి వున్న బట్టలన్నీ మాసిపోయాయి. వర్షాలు కనుక చాకలి రాలేదు. ఆ సమయంలోనే సుజాతకు జ్వరం వచ్చింది. ఈ పరిస్థితిలో ఆమెను బట్టలు ఉతక మనడం భావ్యం కాదనుకున్నాడు. ఇక మిగిలింది అత్తగారు పెట్టిన ఆ కొత్త బట్టలే. గత్యంతరం లేక వాటిని వేసుకున్నాడు. "ఆ బట్ట లేమిటి? ఆ రంగేమిటి!" అని ఎవరన్నా ఎగతాళి చేస్తారేమోనని జంకుతూ ఆఫీసుకు బయలుదేరాడు.

దారిలో అతని మిత్రుడు సుబ్బారావు ఎదు రయ్యాడు. "హలో మోహన్! వారెవ్వా! ఈ డ్రస్సులో హీరోలా మెరిసిపోతున్నావోయ్. స్పెషల్ గార్మెంట్స్ వేశావు. ఏంటి విశేషం. ఈ రంగు నీకు చక్కగా అమిరింది" అన్నాడు.

మోహన్ అసహనంగా "అయ్యాయా పొగడ్తలు, పరాచికాలు" అన్నాడు.

సుబ్బారావు ఆశ్చర్యపోతూ "ఇందులో పరిహాస మేముంది. నీతో నే నెప్పుడైనా వేళాకోళమాడానా? ఈ బట్టలు నిజంగానే బాగున్నాయి"అన్నాడు.

ఆఫీసులో అందరూగూడా మోహన్ దుస్తులు బాగున్నాయన్నారు. గుమాస్తా అయితే " ఈ అరటి కాయ రంగు చొక్కా తీసుకోవాలని ఎప్పటినుంచో అనుకుంటున్నాను. ఏ షాపులోనూ నచ్చిన రంగు దొరకడం లేదు. ఏంటో నాకు బట్టలు సరిగా కుదిరి చావవు" అని ఈర్ష్య పడ్డాడు.



అందరూ మెచ్చుకుంటూ వుండటంతో మోహన్‌కి ఆ బట్టలపై మక్కువ కలిగింది. వాటినే ఎక్కువగా వేసుకోసాగాడు. వాటిని వేసుకున్నప్పుడల్లా సుజాత అతని వంక పరిశీలనగా చూసేది. ఇంత మంచి బట్టలు అతనికి ఎందుకు నచ్చలేదూ? అన్నట్లుండేది ఆమె దృష్టి.

ఒక సారి మోహన్ ఆఫీసు పనిమీద బస్సులో వెళుతుండగా అతని పక్కనే కూర్చున్న ఒకాయన "బాగున్నారా!" అని పలకరించి "మీరు చంద్రశేఖరం అల్లుడు కదూ. మాదీ ఆ ఊరే. నా పేరు వీరభద్రయ్య. బట్టల వ్యాపారం చేస్తుంటాను. ఆ గ్రామంలో మాదే పెద్ద షాపు. ఇప్పుడు మీరు వేసుకున్న బట్టలు మా షాపులో తీసినవే. పండక్కి మంచి బట్టలు కావాలి, ఖరీదు ఎక్కువయినా పరవాలేదు." అని అడిగితే వీటిని నేనే ఎంపిక చేశాను. మంచి కంపెనీ బట్టలు. వెయ్యి రూపాయలు అయింది. పాపం చంద్రశేఖరం అప్పుడో వందా, అప్పుడో వందా కడుతూనే వున్నా, ఆ బాకీ ఇంకా రెండు వందలు మిగిలే వుంది" అన్నాడు.

మోహన్ మనసు నిండా విచారం అలముకుంది. అతను మామూలుగా కొనే బట్టలు నాలుగైదు వందలకు మించి వుండవు.

ఇంటికి వెళ్లిన మోహన్, భార్య సుజాతను దగ్గరకు పిలిచి ఆమె చేతులు పట్టుకుని కన్నీళ్ల పర్యంతమవుతూ "కాంతమ్మ మాటలకు ప్రభావితమై మీ నాన్న గారు ప్రేమతో పెట్టిన మంచి బట్టల్ని వేసుకోకుండా మిమ్మల్ని ఎంతో క్షోభపెట్టాను" అన్నాడు.

సుజాత భర్తను అనునయిస్తూ "ఆ కాంతమ్మకీ, మా అమ్మకూ అంతకు వారం క్రితమే చిన్న తగాదా ఏదో జరిగిందట. అప్పుడు వారి మధ్య మాటలు గానీ రాకపోకలు గానీ లేవు. అందుకే ఆ కాంతమ్మ మీ ముందు మా నాన్నని అలా దెప్పి పొడిచింది." అంది.

మోహన్ కోపంగా "అయితే ఈ విషయం నాతో అప్పుడే ఎందుకు చెప్పలేదు" అని గద్దించాడు.

సుజాత శాంతంగా "ఈ సంగతి మీతో ఆ రోజే చెప్పివుంటే మా నాన్నను చులకన చేసి మాట్లాడిందన్న అక్కసుతో అలా అంటున్నానని, తండ్రిని వెనకేసుకొస్తున్నాననీ మీరు అపోహ పడే ప్రమాద ముంది. అసలు సంగతి మీ అంతట మీరు తెలుసుకోవడమే సరియైన మార్గం. కనుక ఆ ప్రస్తావన తీసుకురాలేదు" అంది.

"మంచితనం మూర్తీభవించిన మీ ముందు ఇప్పుడు నేనెంతో అల్పుణ్ణి అనిపిస్తోంది. వాస్తవాలు తెలుసుకోకుండా ఒకరు కాదంటే కాదనుకుంటూ, ఇంకొకరు అవునంటే అవుననుకుంటూ గాలికి ఎటుపడితే అటు ఎగిరిపోయే విస్తరాకులాంటి చెదిరిపోయే నా మనస్తత్వానికి సిగ్గుపడుతున్నాను. కేవలం ఇతరుల అభిప్రాయాల పైనే ఆధారపడక నిజమేదో, అబద్ధమేదో తెల్చుకుని సొంత వ్యక్తిత్వంతో స్వతంత్ర నిర్ణయాలు తీసుకోగలిగిన మనిషే ఉత్తముడనే మాట ఎంతో అర్థవంతమైందని గ్రహించాను. సొంత ఆలోచన లేక ఇతరుల అభిప్రాయాలను బట్టి తన అభిప్రాయాలు మార్చుకునే వాడు ఒక రకమైన బానిస లాంటి వాడని తెలుసుకున్నాను. ఇక మంచి నా స్వభావం మార్చుకుంటాను" అన్నాడు.

ఆ మాటలకు ఆమె కళ్లల్లో ఓ కొత్త కాంతి కనిపించింది.